విలేకరులు కావలెను
మెదక్ టుడే తెలుగు దినపత్రిక, జ్వాల తెలుగు న్యూస్ చానల్‌లో పనిచేయుటకు, తెలంగాణ, ఏపీలో నియోజకవర్గ రిపోర్లర్లు, మండల రిపోర్టర్లు కావలెను
వివరాలకు సంప్రదించండి
సి.హెచ్ శివ కుమార్
9494117870,
9553335493

RNI NO,TELTEL/2023/88524

# మెదక్ టుడే

తెలుగు దినపత్రిక MEDAK TODAY

మంగళవారం, నవంబర్ 19 2024 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 43



# తెలంగాణకు పెట్టుబడుల జాతర!

● తరలివస్తున్న అంతర్జాతీయ ప్రాజెక్టులు ● తెలంగాణకు క్యూ కట్టిన 141 కంపెనీలు ● 35వేల కోట్ల పెట్టుబడులకు సన్నద్ధం ● 51వేల మందికి ప్రత్యక్ష ఉపాధి ● 1.5లక్షల మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు ● సీఎం రేవంత్, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు చొరవ ● హైదరాబాద్‌లో సెమీ కండక్టర్ల యూనిట్ ● హెల్కేర్ రంగంలో ఏఐ సమ్మిట్కు సన్నాహాలు ● అండర్ 18 స్టూడెంట్స్తో మాక్ అసెంబ్లీ ● సోషల్ మీడియాలో చిచ్చరపిడుగుల ముచ్చట్లు ● గురుకుల పాఠశాలలపై ప్రత్యేక నజర్ ● కుళ్లిన కూరగాయాలు, దొడ్డు వడ్ల బియ్యం వద్దు ● ఎక్కడైనా వండివార్చినట్టు తెలిస్తే సీరియస్ యాక్షన్ ● తెలంగాణలో మొదలైన కొలువుల జాతర ● ఏడాది ప్రజాపాలనలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు

**హైదరాబాద్:నవంబర్-18:** రేవంత్ సీఎంగా పగ్గాలు చేపట్టాక అటు అమెరికా, సౌత్ కొరియా పర్యటనలు చేపట్టారు. పెట్టుబడులే లక్ష్యంగా చేసిన ఈ పర్యటనలు ఏడాదిలోపే సత్ఫలితాలు ఇచ్చాయి. అందుకు నిదర్శనంగా భారీగా వచ్చిన పెట్టుబడులే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. లైఫ్ సైన్సెస్ రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చెందిన 141 కంపెనీలు ?35,820 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంతో 51వేల మందికి ప్రత్యక్షంగా, లక్షన్నర మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించ బోతున్నాయి. **హెల్కేర్లో ఏఐ సమ్మిట్..** అమెరికా, జపాన్, జర్మనీ వంటి దేశాలకు చెందిన ప్రపం చస్థాయి కంపెనీలు హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ కేంద్రంగా తమ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయి. ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షిం చడంతోపాటు ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు అతి త్వరలోనే లైఫ్ సైన్సెస్ నూతన విధానాన్ని రేవంత్ ప్రభుత్వం ప్రవేశపెట్టబోతోంది. కొత్తగా పెట్టుబడులు పెట్టిన 141 కంపెనీల్లో కొన్ని నిర్మాణాలు మొదలుపెట్టగా.. మరికొన్ని ఉత్పత్తి ప్రారంభించే దశలో ఉన్నాయి. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కొత్త కంపెనీలకు హైదరాబాద్ కేంద్ర బిందువైంది. అంతే కాకుండా ఎప్పటికప్పుడు అప్డేట్ అయ్యే ఉద్దేశంతో జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో సమ్మిట్స్ నిర్వహిస్తున్నారు. హెల్త్‌కేర్, ఫార్మా రంగంలో ఏఐ ప్రాముఖ్యంపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో 18 తేదీన రాష్ట్ర ప్రభుత్వ ఏఐ ఇన్ హెల్త్‌కేర్ సమ్మిట్ నిర్వహించబోతోంది. **సీఎం ఆలోచన సూపర్...** నవంబర్ 14వ తేదీ.. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా SCERTలో పిల్లలతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలను అభినందిస్తూనే.. 21 ఏళ్లకే ఎమ్మెల్యే పదవికి పోటీ చేసేలా వయసు కుదించాలని సూచన చేశారు. కాగా, సోషల్ మీడియాలో అండర్

వివరాలు 2లో



# అప్పల కోసమే టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

## కెసిఆర్ బాటలోనే అప్పులు చేస్తున్న రేవంత్ మరోమారు మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్:నవంబర్-18:** కేసీ ఆర్, రేవంత్‌రెడ్డి రాజకీయాల్లో నైతిక విలువలు వదిలేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండి పడ్డారు. రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానిం చారు. కేసీఆర్ రూ.7 లక్షల కోట్లమేర అప్పులు చేస్తే...రేవంత్ రెడ్డి ఏకంగా అప్పుల కోసం ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో భారాస, కాంగ్రెస్ పార్టీలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని కిషన్‌రెడ్డి మరోమారు విమర్శించారు. గతంలో భారాస ప్రభుత్వం ఎలా ఉందో.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు కూడా అలాగే ఉందన్నారు. అదే రకమైన అవినీతి, గాలి మాటలు విని ప్రజలు విసిగి పోతున్నారన్నారు. రైతు భరోసా, రుణమాఫీ లేదు. పింఛన్లు పెంచుతామన్నారు.. ఒక్క రూపాయి పెంచలేదు, కొత్త పింఛన్లు ఇవ్వలేదు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. హామీలన్నీ ఆయన గాలికొదిలేశారు. పైగా మహారాష్ట్రలో నిర్వహిస్తున్న ప్రచారంలో తెలంగాణ సస్యశ్యామలం అయిందంటూ మాట్లాడుతు న్నారు. ఇంతకంటే అబద్దాలు

# దళిత రైతుల ఇళ్లపై దౌర్జన్యకాండ



● సీఎం బ్రదర్ గిరిజన రైతులపై దాడి చేసినా కేసులుండవా? ● లగచర్లలో అర్ధరాత్రి మహిళలపై పోలీసుల దాడి చేశారు ● గిరిజన రైతులను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు ● తెలంగాణలో ఏం జరుగుతుందో దేశానికి తెలియాలి ● భూములను ప్రభుత్వం బలవంతంగా గుంజుకుంటోంది ● లగచర్ల ఘటన చిన్నదేమీ కాదు.. ● ఈ ఘటనపై ప్రధాని, రాహుల్ గాంధీ స్పందించాలి ● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

**న్యూఢిల్లీ,నవంబర్18:** మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదని.. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు డిమాండ్ చేశారు. లగచర్ల బాధితులతో కలిసి ఆయన జాతీయ మానవహక్కుల సంఘాన్ని కలిశారు. అనంతరం బాధితులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో ఏం జరుగుతుందో దేశానికి తెలియాలని.. పేద గిరిజనుల భూములను రేవంత్ సర్కార్ బలవంతంగా గుంజుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. అర్ధరాత్రి పోలీసులు, ప్రైవేటు వ్యక్తులతో కలిసి దళిత రైతుల ఇళ్లపై దౌర్జన్యకాండ జరుగుతుందని.. సీఎం బ్రదర్ గిరిజన రైతులపై దాడి చేసినా కేసులుండవని విమర్శించారు. ప్రజాప్రతినిధి కాకున్నా సీఎం సోదరుడికి కలెక్టర్ స్వాగతం పలుకుతున్నారన్నారు. రాజ్యాంగ రక్షకులమంటున్న రాహుల్ సీఎం వివరాలు 2లో ర్గంలో

# ఈటల రాజేందర్, డీకే అరుణ, ఏలేటి మహేశ్వర్ రెడ్డి అరెస్ట్



**హైదరాబాద్:నవంబర్-18:** తెలంగాణ బీజేపీఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ అరెస్ట్ అయ్యారు. లగచర్ల బాధితులను పరామర్శించడానికి వెళుతున్న వారిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకొని నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.వీరితో పాటు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిని సైతం మొయినాబాద్ వద్ద అడ్డుకొని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కాగా, లగచర్లలో ఫార్మా కంపెనీని వ్యతిరేకిస్తున్న రైతులు.. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన వికారాబాద్ కలెక్టర్‌పై, అధికారులపైన దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. మరోవైపు ఈ ఘటన సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం అయిన కొడంగల్‌లో జరుగడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నది. అయితే తమపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారంటూ ఫార్మా బాధితులు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలిసి నేడు ఫిర్యాదు చేశారు. జాతీయ మానవహక్కుల కమిషన్‌లో కూడా రాష్ట్ర ప్రభుత్వంపైన, పోలీస్‌లపైన ఫిర్యాదు చేశారు.

# సొంత నియోజకవర్గంలోనే భూములు లాక్కున్నాడంటే సీఎం ఎంత దుర్మార్గుడో తెలుస్తుంది

- రైతుల జీవనాధారాన్ని గుంజుకుంటే ఏలా బతుకుతారు?

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్




# నేడు వరంగల్‌లో విజయోత్సవ సభ

● భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
● ఇదో మైలురాయి కానుందన్న మంత్రులు

2లో

# కాంగ్రెస్‌లో అంతర్గత స్వేచ్ఛ ఎక్కువే

● జనవరిలో పదవుల పందేరం ● స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి
● కార్యకర్తలకు పిసిసి చీఫ్ మహేశ్ సూచన



## హైదరాబాద్‌లో మరోసారి ఐటీ దాడులు..

### - స్వస్తిక్ రియల్ ఎస్టేట్ కంపెనీలో తనిఖీలు

హైదరాబాద్:నవంబర్-18: హైదరాబాద్ బేగంబజార్‌లో ఐటీ దాడులు కలకలం సృష్టించాయి. స్వస్తిక్ రియల్ ఎస్టేట్ కంపెనీలో తనిఖీలు నిర్వహించారు ఐటీ అధికారులు. బేగంబజార్, బంజారాహిల్స్, షాద్‌నగర్, చేవెళ్లలో భారీ బందోబస్తు మధ్య ఉదయం నుంచి ఐటీ తనిఖీలు కొనసాగిస్తున్నారు. కల్పన రాజేంద్ర, లక్ష్మణ్ నివాసాల్లో సోదాలు జరిపిన అధికారులు %వీచీజ% కంపెనీకి 300 కోట్ల రూపాయల విలువైన ల్యాండ్ విక్రయించినట్టు గుర్తించారు. అలాగే షాద్‌నగర్‌లోని భూమి అమ్మినట్టు వివరాలు సేకరించారు. బ్యాలెన్స్ షీట్స్‌లో భూవిక్రయం చూపలేదన్న ఆరోపణల నేపథ్యంలో ఐటీ రైడ్స్ కొనసాగుతున్నాయి.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

హైదరాబాద్:నవంబర్-18: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు పేపర్లకు కలిపి మొత్తంగా 50 శాతం మందే హాజరయ్యారు. పేపర్1 పరీక్షకు 51.1 శాతం, పేపర్ 2 పరీక్షకు 50.7శాతం హాజరు కాగా, సోమవారం నిర్వహించిన పేపర్ 3కి 50.24 శాతం మంది హాజరైనట్లు టీజీపీఎస్సీ అధికారులు వెల్లడించారు. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 71.30 శాతం మంది హాజరు కాగా, అత్యల్పంగా వరంగల్ జిల్లాలో 49.93 శాతం మంది హాజరయ్యారు. ఈ గ్రూప్-3 నోటిఫికేషన్ ద్వారా 1363 పోస్టులను భర్తీ చేయనున్నారు.

## అప్పుల కోసమే టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటాయా? కాంగ్రెస్, భారాస తమ వైఫల్యాలు కప్పిపుచ్చు కునేందుకు ప్రయత్నిస్తున్నాయి.దేశంలో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉండి భ్రష్టు పట్టించిందని కిషన్‌రెడ్డి విమ ర్శి ంచారు. భాజపా నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని భాజపా పోలింగ్ బూత్ కమిటీల నియామకం చేపట్టాలి. మళ్లీ మండల స్థాయి వర్క్‌షాపు లు ఉంటాయి. ఈ నెల 22న దిల్లీలో జరగనున్న పార్టీ సంస్థాగత సమావేశాల్లో మండల, జిల్లా ఎన్నికల తేదీలు వస్తాయి. తెలంగాణలో పనిచేయడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో గ్రహించాలన్నారు.

## వేములవాడ అభివృద్ధి పనులకు రూ.127.65 కోట్లు

హైదరాబాద్:నవంబర్-18: వేములవాడలో అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.127.65 కోట్లు మంజూరు చేసింది. శ్రీరాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తుల సదుపాయాలకు రూ.76 కోట్లు కేటాయించింది. వేములవాడ ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్ల విస్తరణ చేపట్టనున్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణకు ప్రభుత్వం (÷ఉ ఉనీలIసనిపIనిబి) రూ.47.85 కోట్లు మంజూరు చేసింది. బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల వరకు డ్రైనేజీ నిర్మాణానికి రూ.3.8 కోట్లు కేటాయించింది.

## ఆక్రమణలను కూల్చిన హైడ్రా

హైదరాబాద్:నవంబర్-18:రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతలు మళ్లీ కొనసాగుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో సోమవారం ఉదయం మరిన్ని కూల్చివేతలను మొదలుపెట్టాయి. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వందనపురి కాలనీలో 848 సర్వే నంబర్‌లో ఉన్న నిర్మాణాన్ని నేలమట్టం చేశాయి. భారీ యంత్రాలతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు అమీన్‌పూర్ పరిధిలోని పలు నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు సమీపంలో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. కాగా, రహదారిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్లు హైడ్రా అధికారులు చెబుతున్నారు.

## దూరదృష్టితో సర్వే చేపట్టాం: పొంగులేటి



హైదరాబాద్:నవంబర్-18: ఎంతో దూరదృష్టితో కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేను చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. అయితే, గత ప్రభుత్వం సమగ్ర సర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

# తెలంగాణకు పెట్టుబడుల జాతర!

(మొదటి పేజీ తరువాయి)

చిచ్చరపిడుగులు చేసిన అల్లరి అంతా ఫుల్ హల్చల్ అవుతోంది. **గురుకులాలపై స్పెషల్ నజర్...** సాధారణంగా ప్రభుత్వ హాస్టల్స్, గురుకులాలు అంటే పురుగుల అన్నం, నీళ్ల చారు, ఫుడ్ పాయిజన్ ఇవే సమస్యలు వస్తుంటాయి. అయితే.. రేవంత్ ప్రభుత్వం మాత్రం ఇలాంటివి రిపీట్ అయితే ఊరుకోబోమని స్పష్టం చేస్తోంది. బాలల దినోత్సవం సందర్భంగా ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. గురుకులాల్లో చదువుకునే విద్యార్థులకు నాసిరకం భోజనం పెడితే జైలుకు పంపుతామని, దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో వండి పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కఠిన చర్యలు తీసుకుంటామంటున్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు వారానికి రెండుసార్లైనా ప్రభుత్వ హాస్టల్స్‌ని పర్యటించాలనే రూల్ పెట్టారు. **కొలువుల జాతర...** ఎప్పటికప్పుడు పరీక్షలు పెట్టడం, ఫలితాలు ప్రకటించడం, ఆ వెంటనే నియామకాలు చేపట్టడం.. ఇదీ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక కనిపిస్తున్న మార్పు. గత ప్రభుత్వ హయాంలోనే నోటిఫికేషన్లు రిలీజై.. రిజల్ట్స్ రాక, నియామకాలు లేక ఇబ్బంది పడుతున్న సమస్యలకు తాజా ప్రభుత్వం చెక్ పెడుతోంది. లేటెస్టుగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 ఫలితాలను వెల్లడించింది. 8,084 మందితో కూడిన తుది జాబితాను రిలీజ్ చేసింది. 2022 డిసెంబర్ 1వ తేదీన ఇచ్చిన నోటిఫికేషన్‌లో భాగంగా 8,180 పోస్టులకు గాను 9లక్షల 51 వేల 321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. **సిటీకి సెమీ కండక్టర్ ఇండస్ట్రీ...** తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం చూసి కంపెనీలు క్యూ కడుతున్నాయి. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కూడా ప్లస్ అవుతున్నాయి. దీంతో అంతర్జాతీయ కంపెనీలు ముందుకు వస్తున్నాయి. తాజాగా అంతర్జాతీయ సెమీకండక్టర్ల కంపెనీ అలెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్‌లో పరిశోధనాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేయడానికి ముందుకువచ్చింది. ఈమేరకు ఆ కంపెనీ సీఈఓ టీమ్ సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో ఈనెల 15వ తేదీన భేటీ అయ్యింది. పలు ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీలకు సెమీ కండక్టర్లు సరఫరా చేస్తున్నట్లు అలెగ్రో ప్రతినిధులు మంత్రికి వివరించారు. అలెగ్రో పరిశోధనాభివృద్ధి సంస్థ ఏర్పాటుతో 500 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

# దళిత రైతుల ఇళ్లపై దౌర్జన్యకాండ

(మొదటి పేజీ తరువాయి)

దమనకాండ స్పందించాలన్నారు. లగచర్లలో అర్ధరాత్రి మహిళలపై పోలీసుల దాడి చేశారని.. గిరిజన రైతులపై అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారన్నారు.లగచర్ల ఘటనపై ప్రధాని మోదీ, రాహుల్, ఖర్గే ఎందుకు స్పందించరు? అంటూ ప్రశ్నించారు. మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదని.. సీఎం సోదరుడి కంపెనీ కోసమే ఇంతమంది గిరిజనులు బాధపెడు తున్నరని ఆరోపించారు. తెలంగాణలో ఏం జరుగుతుందో తెలియనట్లు బీజేపీ నాటకాలు ఆడుతుందని.. సీఎం నియోజక వర్గంలో జరుగుతున్న దమనకాండపై స్పందించాలని డిమాండ్ చేశారు. పేద గిరిజనుల బాధ రాహుల్‌గాంధీకి కనిపిస్తలేదా?.. లగచర్లపై అర్ధరాత్రి దమనకొండ బీజేపీకి కనబడడం లేదా? అంటూ నిలదీశారు. కొడంగల్‌లో 3వేల ఎకరాల్లో ఫార్మా విలేజీ కోసం సీఎం నిర్ణయించారని.. రైతులకు నోటీసులు ఇచ్చి.. వాటిని తిరస్కరించిన వారిని బెదిరిస్తున్నారన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం గడువు ముగిసింది.. రాహుల్ ఇప్పటికైనా స్పందించాలని.. రైతులతో చర్చలు జరిపేందుకు ఎవరూ ముందుకురావడం లేదన్నారు. ఫార్మా సిటీ కోసం మా హయాంలో 14వేల ఎకరాల భూమిని సేకరిస్తున్నారని.. తమ హయాంలో ఆ రైతులందరినీ ఒప్పించి భూములను సేకరించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తి చూపితే అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని.. మా బీఆర్ఎస్ నేతలందరూ జాతీయ మానవహక్కుల, మహిళా హక్కుల కమిషన్‌ను కలిశారన్నారు. ఎస్టీ హక్కుల కమిషన్ సైతం కలిసి లగచర్ల దమనకాండ వివరించారన్నారు. సీఎం నియోజకవర్గంలో తొమ్మిది నెలలుగా గొడవలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఎకరానికి రూ.60-రూ.70లక్షల విలువైన భూమికి రూ.10లక్షలు ఇస్తామంటున్నారని.. లగచర్ల అర్ధరాత్రి మహిళలనీ చూడకుండా దాడులు చేశారన్నారన్నారు. గిరిజన రైతులను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారని.. మణిపూర్ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ కొడంగల్ దమనకాండపై ఎందుకు మాట్లాడరు ? మండిపడ్డారు. రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ సైతం స్పందించాలని డిమాండ్ చేశారు. రాజ్యసభలో ఈ విషయం లేవనెత్తుతాం.. పార్లమెంట్‌లోనూ ఈ విషయం మాట్లాడాలని కోరుతామన్నారు. లగచర్ల బాధితుల తరఫున ఢిల్లీకి బీఆర్ఎస్ శ్రేణులందరికీ ధన్యవాదులు చెబుతున్నానన్నారు. న్యాల్‌కల్‌తో పాటు పలుచోట్ల భూముల విషయంలో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారని.. కందుకూరు, యాచారంలో పర్యటించి రైతుల్లో కాంగ్రెస్ నేతల్లో విషం నింపారన్నారు. అదే 14వేల ఎకరాల్లో ఫోర్త్‌సిటీ, ఫార్మా విలేజీలను ఏర్పాటు చేస్తున్నారని, భూములు ఇవ్వకపోతే తొక్కుతామని సీఎం సోదరుడు అంటున్నాడని మండిపడ్డారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇంత ఆందోళన జరిగితే రేవంత్ మహారాష్ట్రలో ప్రచారం చేస్తారా? అంటూ ధ్వజమెత్తారు. ఢిల్లీకి మూటలు పంపుతున్నందుకు రేవంత్ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఉద్దేశం మాకు లేదన్నారు.

# సొంత నియోజకవర్గంలోనే భూములు లాక్కున్నాడంటే సీఎం ఎంత దుర్మార్గుడో తెలుస్తుంది

- రైతుల జీవనాధారాన్ని గుంజుకుంటే ఏలా బతుకుతారు?
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

హైదరాబాద్:నవంబర్-18: సీఎం సొంత నియోజకవర్గంలో గిరిజనులపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా ఆ భూములను ఆధారంగా చేసుకొని బతుకుతున్న వారి జీవనాధారాన్ని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. లగచర్లలో అర్ధరాత్రి సమయంలో పోలీసులు సృష్టించిన అరాచకంపై బాధితులు ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాలోతు కవితతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. గత 9 నెలలుగా తమ భూములు ఇవ్వమని లగచర్ల రైతులు చెబూతునే ఉన్నారని సత్యవతి రాథోడ్ అన్నారు. భూములు తీసుకుంటామంటే ఆవేశంలో కొంతమంది దాడి చేశారని చెప్పారు. దాన్ని సాకుగా చూపి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. అర్ధరాత్రి కరెంట్ తీసేసి, ఇంటర్ నెట్ బంద్ చేసి మహిళలను హింసించారని.. కొట్టారని.. బూతులు తిట్టారని అన్నారు. 51 మంది రైతులపై అక్రమ కేసులు పెట్టారని.. ఊళ్లో ఉన్న మగవాళ్లంతా పారిపోయారని చెప్పారు. మళ్లీ ఏం చేస్తారోనని ఇప్పటికీ భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ధర్మ పోరాటానికి అండగా ఉండాలని రైతులు అన్ని పార్టీల నాయకులను కోరారని సత్యవతి రాథోడ్ తెలిపారు. బీఆర్ఎస్ వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికీ కూడా పోలీసులు గ్రామంలోకి వచ్చి ఇంకా అరెస్ట్ లు చేస్తున్నారని పేర్కొన్నారు. బాధితులకు ఉరి శిక్ష పడుతుందని రేవంత్ రెడ్డి సోదరుడు బెదిరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ భూములు గుంజుకుంటామని చెబుతున్నాడని మండిపడ్డారు. ఢిల్లీలో మాత్రమే న్యాయం జరుగుతుందని భావించి ఇక్కడకు వచ్చామని తెలిపారు. జాతీయ మానవహక్కుల కమిషన్ ను కలిసి పోలీసులు చేసిన అఘాయిత్యాలపై వివరించామని స్పష్టం చేశారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ, మహిళ కమిషన్ ను కూడా కలుస్తామని వెల్లడించారు. న్యాయం జరుగుతుందని భావిస్తున్నామని అన్నారు.. రాష్ట్రపతి



కూడా ఆదివాసీ బిడ్డే అని.. ఆమె మాకు సమయం ఇస్తే వారికి కూడా ఈ సంఘటనను వివరిస్తాని తెలిపారు. కొద్ది రోజులుగా బాధితుల ఆవేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని అన్నారు. లగచర్ల బాధితులందరికీ బీఆర్ఎస్ పార్టీ తరపున అండగా ఉంటామని తెలిపారు. తండ్రుల వారసత్వంగా వచ్చిన భూములను ఫార్మా కంపెనీ ఇవ్వాలని అంటున్నారని మాలోతు కవిత అన్నారు. ఫార్మా సిటీ కోసం గత ప్రభుత్వం ఇప్పటికే భూములు సేకరించిందని.. దాన్ని కాదని గిరిజనుల భూములను రేవంత్ రెడ్డి లాక్కుంటున్నాడని మండిపడ్డారు.

# కాంగ్రెస్‌లో అంతర్గత స్వేచ్ఛ ఎక్కువే

- జనవరిలో పదవుల పందేరం
- స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి
- కార్యకర్తలకు పిసిసి చీఫ్ మహేశ్ సూచన



సంగారెడ్డి,నవంబర్18: కాంగ్రెస్ పార్టీలో ఉన్న స్వేచ్ఛ ఏ పార్టీలో లేదని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ ని వ్యతిరేకించిన అది పార్టీ కోసమే కానీ వ్యక్తిగతం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కొంత నారాజ్ ఉన్నారని.. తాము మీకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. మన ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి ఒక్క కార్యకర్త ప్రజలకు వివరించాలని సూచించారు.సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశం సందర్భంగా పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. జనవరిలో కొంతమంది పార్టీ నాయకులకు పదవులు ఇస్తామని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మన సత్తా చాటాలని అన్నారు. అధికారంలోకి వచ్చి 11 నెలల్లోనే ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీపై కుట్ర పన్నుతున్నా యన్నారు. కార్యకర్త కూడా సీఎంను కలిసే వెసులుబాటు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉందని వ్యాఖ్యానించారు. కార్యకర్తలు నారాజ్ అయితే తాము కుర్చీ దిగాల్సిందేనన్నారు. మరోసారి మనం అధికారంలోకి రావాలి.. ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రధాని కావాలి అని కామెంట్స్ చేశారు. కేసీఆర్ రాష్టాన్ని ఆగం చేస్తే కాంగ్రెస్ పార్టీ రిపేర్లు చేస్తుంద న్నారు. బంగారు తెలంగాణ అంటే కేసీఆర్ కుటుంబం మాత్రమే బంగారుమయం అయ్యిందని సెటైర్లు వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీటలు బారుతున్నాయని.. కాంగ్రెస్ పార్టీ కట్టిన ప్రాజెక్టు 70 ఏళ్లయిన చెక్కు చెదరలేదని అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావుకి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. మీరు పదేళ్లలో ఎంత అభివృద్ధి చేశారో చెప్పండి..మేము 11 నెలల్లో ఎంత అభివృద్ధి చేశామో చూపిస్తామని ఛాలెంజ్ చేశారు. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్ఎస్ ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# నేడు వరంగల్‌లో విజయోత్సవ సభ

- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఇదో మైలురాయి కానుందన్న మంత్రులు

వరంగల్,నవంబర్18: వరంగల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలన విజయోత్సవ సభకు భారీఏర్పాట్లు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు సంబంధించి మంత్రులు సీతక్క, కొండా సురేఖ, శ్రీధర్ బాబులు దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. ఈ సభ కాంగ్రెస్ పాలనలో ఓ మైలురాయి అన్నారు. మహిళాశక్తి సదస్సుతో సత్తాచాటుతామని అన్నారు. మహిళలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నామని మంత్రులు అన్నారు. ఇకపోతే ఓరుగల్లుకు మహర్దశ వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పర్యటనకు ముందే నిధుల వరద పారింది. మామునూరు విమానాశ్రయం పునరుద్ధరణ, భూసేకరణ, విజన్-2041 వరంగల్ నూతన మాస్టర్ ఎ÷-లాన్‌ను ఆమోదిస్తూ ఆదివారం సాయంత్రం జీవో జారీ చేశారు. గత మూడేళ్లుగా నిధులు లేక పెండింగ్‌లో ఉన్న వరంగల్ మహా నగరపాలక సంస్థ పరిపాలన భవన నిర్మాణానికి రూ.32.50 కోట్లు కేటాయించారు. ఐదు అంతస్తులు, ఆధునిక హంగులతో భవన నిర్మాణం చేపడతారు. ఈనెల 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పర్యటనపై గ్రేటర్ వరంగల్, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ అప్రమత్తమైంది. హనుమకొండ బాలసముద్రంలో కాళోజీ కళాక్షేత్రం, హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేటు, ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల సభాస్థలి, కాజీపేట నుంచి హనుమకొండ వరకు ప్రధాన రహదారులకు మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు, దోమల నివారణకు ఫాగింగ్ తదితర పనుల పురోగతిని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పరిశీలించారు. సీఎం పర్యటన ముగిసే వరకు అన్ని విభాగాల వింగ్ అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులు నగరంలోనే ఉండాలని, సెలవులు లేవని కమిషనర్ ఆదేశించారు. వరంగల్ త్రినగరాల చుట్టూ ప్రతిపాదించిన ఇన్నర్ రింగురోడ్డు పొడిగింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఖమ్మం జాతీయ రహదారి నాయుడు పంపు కూడలి నుంచి ఖిలావరంగల్ కోట, స్తంభంపెల్లి శివారు మీదుగా నర్సంపేటరోడ్ జానిపీరీల నుంచి గొర్రెకుంట క్రాస్‌రోడ్, కీర్తినగర్ నుంచి ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ వరకు 8 కి.మీ. ఇన్నర్ రింగురోడ్డును పొడిగించారు. 200 అడుగుల రహదారి పనుల అంచనా వ్యయాన్ని రూ.50 కోట్ల నుంచి రూ.80 కోట్లకు పెంచారు. గతంలో సీఎం హామీల పథకం ద్వారా రూ.50 కోట్లు కేటాయించారు.

## సంపాదకీయం

# జనాభా పెరుగుదలతో వనరుల కొరత !

జనాభా పెరుగుదల వనరులకు ముప్పుగా పరిణమించనుంది. ఆరత్లాంటి దేశాలు ఇప్పటికే జనాభాతో సమస్యలు ఎదర్కొంటోంది. మేమిద్దరం..మాకిద్దరు.. అన్న నినాదం చాలా పాతది. మళ్లీ ఇప్పుడు ఆ నినాదాన్ని విధానంగా తీసుకుని ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. జనాభా నియంత్రణ అన్నది అన్ని వర్గాలకు,కులాలకు సమానంగా ఉండాలి. దీనిలో నియంత్రణఅన్నది ఉండరాదు. దీనికితోడుయువత జనాభాతగ్గుతోందన్న ఆందోళన కూడా ఉంది. జనాభా నియంత్రణ అత్యవసర, తక్షణ చర్యగా మారాలి. కేంద్ర,రాష్ట్రాలు జనాభా నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలి. జనాభా నియంత్రణ అన్నది దేశ విశాల ప్రయోజన చర్యగా గుర్తించాలి. ఇందులో ఎలాంటి భేషజాలకు పోరాదు. ఎలాంటి బుజ్జగింపులకు తావుండరాదు. అలాగే మతాల ఆధారంగా జనాభాపై ఆంక్షలుఉండరాదు. దేశంలో జన విస్ఫోటనంతో ఇప్పటికే ఆహారభద్రత ఆందోళనకరంగగా మారింది. నిరుద్యోగం పెరిగుతోంది. వనరులు రోజురోజుకూ హరించుకుపోతున్నాయి. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా ఆకలిగొన్నవారు కోట్లలోనే ఉంటున్నారు. ఉన్నవారికే తిండీగుడ్డా, గూడు లేకుండా పోతుంది. ప్రపంచ జనాభా 800 కోట్లకు చేరడం ఒక ఎత్తయితే మనదేశ జనాభా మరింతగా పెరిగి చైనాను అధిగమించింది. దాదాపు 140 కోట్లు అంటున్నా ...145 కోట్లు ఉండవచ్చని అంచనా.రానున్న జనాభా లెక్కల సేకరణలో ఇది మరింత స్పష్టత రానుంది. జనాభా పెరుగుదలపై ఐక్యరాజ్యసమితి లెక్కలు ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి. దీనికితోడు పట్టణీకరణతో ప్రకృతి ధ్వంసం అవుతోంది. కాలుష్యం పెరుగుతోంది. సహజవనరులపై దాడి జరుగుతోంది. జనాభా నియంత్రణపై దేశంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గతంలో ఇద్దరు లేక ముగ్గురు అన్న నినాదం బాగా ప్రాచర్యం అయ్యింది. ఇకపోతే పెరుగుతున్న జీవనప్రమాణాల కారణంగా మరణాల రేటు కూడా తగ్గుతోంది. దీంతో వృద్దుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈక్రమంలో దేశంలో ఆహారకొరత రాకుండా చూసుకోవాలి. వనరులు దెబ్బతినకుండా చూసుకోవాలి. ఉన్నవారందరికి గాలి,నీరు సక్రమంగా అందుతుందా లేదా అన్నది కూడా అంచనా వేసుకోవాలి. జనభా పెరుగుదల మానవాళి చరిత్రలో ఓ మైలురాయిగా మారిన నేపథ్యంలో నియంత్రణ కూడా మనచేతుల్లోనే ఉందని గుర్తించి ముందుకు సాగాలి. పేద దేశాల్లో జనాభా గరిష్ట స్థాయిలో పెరుగుతూ ఉంటే, ధనిక దేశాల్లో దీనికి భిన్నమైన స్థితి! 800 కోట్ల జనాభాలో ఆసియా, ఆఫ్రికా దేశాలదే సింహభాగం. దానిలోనూ మన దేశానిదే పైచేయి. గడిచిన పన్నెండేళ్ల లో భారత్‌లో 17.7 కోట్ల మంది పెరగగా, చైనాలో 7.3 కోట్ల మంది పెరిగారని ఐక్యరాజ్యసమితి ఇప్పటికే పేర్కొంది. 2050 నాటికి 170 కోట్ల జనాభాతో భారత్ తొలి స్థానానికి, అదే సమయంలో చైనా జనాభా 130 కోట్లకు పరిమితం కానుందని అంచనా! ప్రపంచ జనాభా 2037 నాటికి 900 కోట్లకు, 2058 నాటికి వెయ్యి కోట్లకు, 2080 నాటికి 1400 కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. ఈలెక్కల అంచనాల మేరకు భారత్‌లోనే జన విస్ఫోటనం విపరీతంగా ఉంది. దీనిని అభివృద్ధిగా కంటే తిరోగమనంగానే చూడాలి. జనాభాను పెంచుకుంటూ పోతే వారికి తినడా నికి తిండికూడా పెట్టలేని దౌర్భాగ్యానికి చేరుకోగలమని గుర్తించాలి. ఎవరికి వారు దీనిపై నియంత్రణ పాటించాలి. భూగోళం మీద జీవం ఉనికి ప్రారంభమైనప్పటి నుండి ఈ స్థాయిలో పురోగతి సాధించిన మరో జీవి లేదనడం అతిశయోక్తి కాదు. జంతువుల్లో జంతువుగా మనుగడ కోసం పోరాడిన స్థితి నుండి బుద్ధిజీవిగా మారేంత వరకు మానవజాతి సాగించిన ఈ ప్రయాణం అనితర సాధ్యం! ఈ క్రమంలోనే భూగోళమంతా మనుషులు విస్తరించారు. భిన్న వాతావరణ పరిస్థితులను, ప్రకృతి వైపరీత్యాలను ఎదర్కొని ముందుకు సాగతున్నారు. అయితే, ఈ విస్తరణ భూగోళమంతా ఒకే మాదిరి జరగలేదు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా జరిగింది. మనుగడ పోరాటంలో భాగంగా మనిషి సాగించిన వలసలూ జనాభా సంఖ్యను ప్రభావితం చేశాయి. నాగరికత పెరిగిన తరువాత పేదరికం కూడా కుటుంబాలలో సభ్యుల సంఖ్యను ప్రభావితం చేసింది. సంతానం ఎక్కువుంటే సంపాదించే వారి సంఖ్య పెరుగుతుందని అనుకోవడం ఇప్పటికీ వింటూనే ఉంటాం. ఐక్యరాజ్య సమితి తాజాగా విడుదల చేసిన నివేదిక కూడా ఇదే విషయాన్ని చెబుతోంది. జనాభా ఈ స్థాయికి చేరుకోవడం మానవాళికి వరమా..శాపమా అన్న లెక్కలు వేసుకుని, అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు ఎటువంటి విధానాలు అవలంబించాలన్నది చర్చచేయాలి. జనాభా విస్ఫోటనం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. చైనాలో ఒకప్పుడు వన్ ఆర్ నన్ నినాదం ఇచ్చిన ఆ దేశ ప్రభుత్వం జనాభాను నియంత్రించగలిగింది. ఇప్పుడు ఒకరు, లేదా ఇద్దరు అంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. కొన్ని దేశాల్లో పిల్లలను ఎక్కువగా కనేవారికి అక్కడి ప్రభుత్వాలు అనేక రాయితీలు కల్పిస్తున్నాయి. రష్యాలాంటి చలిదేశాల్లో ఇది ఆహ్వానించదగ్గదే. ప్రస్తుతం మన దేశంలో యువకుల సంఖ్య అత్యధికంగా ఉంది. మరో యాభై ఏళ్ళ తరువాత ఇదే స్థితి ఉంటుందన్న గ్యారంటీ లేదు. పిల్లలను కనాలా..వద్దా అన్నది భార్యాభర్తలే నిర్ణయించుకుంటారు. అయితే ఎంతమందిని కనాలన్నది ప్రభుత్వం నిర్ణయించాలి. దేశంలోని వనరులను, ఆర్థిక స్థితిగతులను బట్టి జనాభా నియంత్రణ ఇప్పుడే తక్షణావసరమైన చర్యగాచూడాలి. పిల్లలను కంటూ పోతే అటు తల్లికి, ఇటు దేశానికి తీరని నష్టం వాటిల్లగలదు. తల్లి ఆరోగ్యం దెబ్బతిన్నట్లుగానే దేశసౌభాగ్యం కూడా దెబ్బతినగలదు. అందువల్ల దేశంలో ఏకీకృత జనాభా విధానం రావాలి. జనాభా నియంత్రణ అన్నది నిరంకుశంగా మారాలి. కొన్నేళ్ల పాటు ఇలా చేస్తూ పోతే తప్ప మన జానాభాను అదుపులో పెట్టుకోలేం. ఇందుకు కేంద్రం తక్షణంగా స్పందించాలి. తక్షణ చర్యలు చేపట్టాలి. జనాభా నియంత్రణ అన్నది యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. ఇందుకు కఠిన చర్యలకు ఉపక్రమించాలి.

# దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలు







ప్రతి ఒక్కరూ భక్తి భావం ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి
అల్లాదుర్గం మండలంలో లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం దర్శించుకున్న మంత్రివర్యులు
పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికిన అర్చకులు

**(మెదక్ ప్రతినిధి)నవంబర్,18, మెదక్ టుడే న్యూస్:**లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలం దరూ సుఖ సంతోషాలతో ఉండాలిరాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు శ్రీ దామోదర్ రాజన ర్సింహదేవాలయాలు ప్రశాంతతకి నిలయాల ని, ప్రజలందరూ ఆధ్యాత్మిక చింతన భక్తి భావం అలవర్చుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు.మెదక్ జిల్లా అల్లాదుర్గ్ మండల ంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు దర్శించు కున్నారు అర్చకులు పూర్ణకుంభంతో మంత్రి వర్యులకు ఘన స్వాగతం పలికారు. మంత్రి వర్యులు లక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరి ంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు.అనంతరం ప్రజలలో మమేకమైవారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో తాసిల్దార్ మల్లయ్య, సీఐ రేణుక, ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.

# బోనస్ తో పాటు ధాన్యం చెల్లింపులు షురూ

**హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు.**
**ఎన్నడూ లేని విధంగా అతి త్వరగా ధాన్యం కొనుగోలు**
**జిల్లాలో అత్యంత వేగంగా కొనుగోలు ప్రక్రియ**
**రైస్ మిల్స్, ధాన్యం దిగుమతి,సమగ్ర కుటుంబ సర్వే ,**
**దాన్యంకొనుగోలు ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలి.**

**(మెదక్ ప్రతినిధి)నవంబర్,18, మెదక్ టుడే న్యూస్:**
కౌడిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్స్, సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మెదక్ జిల్లాలో సన్న వడ్లకు రైతులకు బోనస్ చెల్లింపు మొదలుకాబడినదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.సోమవారం మెదక్ జిల్లాలో కౌడిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించి ధాన్యం కొనుగోలు రైస్ మిల్స్ సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 490 కొనుగోలు కేంద్రాలకు గాను ఇప్పటివరకు 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు, జిల్లాలో సన్న వడ్లకు1,280 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలుగాను శంకరంపేట ఆర్ మండలం గవ్వల పల్లి గ్రామం,శివంపేట మండలం, తిమ్మాపూర్ గ్రామం,తూప్రాన్ పరిధిలో గుండ్రెడ్డి పల్లి గ్రామాలకు సన్న వడ్లకు 6, లక్షల 40 వేల రూపాయలు బోనస్ రిలీజ్ చేయడం జరిగిందని అన్నారు.ఎన్నడూ లేని విధంగా ధాన్యం అమ్మిన రైతులకి అతి తక్కువ కాలం లోనే చెల్లింపులు జరగడం తో రైతులు ఆనంద పడుతున్నారు.మిల్లర్స్ ధాన్యం కొనుగోలు ద్వారా రవాణా చేసిన ధాన్యానికి దిగుమతి చేసుకొని త్వరిత గతిన చర్యలు చేపట్టాలన్నారు.రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నాణ్యమైన మద్దతు ధరతో కొనుగోలు చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నామని పేర్కొ న్నారు.అహర్నిశలు కాయకష్టం చేసి ఏ



రోజు వచ్చిన ధాన్యం అదే రోజు కొనుగోలు జరిగేలా.. అదే విధంగా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఓ ఎం పి ఎస్ లో అప్పటికప్పుడు నమోదు అయ్యేలా తగు ఆదేశాలుఇచ్చామన్నారు.జిల్లా స్థాయి అధికారు లు, మండల స్థాయి అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి. రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా పర్యవేక్షణ చేస్తున్నారన్నారు.జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా నిన్నటి వరకు 1, లక్ష 37, వేల 673 కుటుంబాలకు సర్వే నిర్వహించామని,62.93% శాతంగా నమోదు అయిందన్నారు.ఈకార్యక్రమంలో కలెక్టర్ వెంట కౌడిపల్లి తాసిల్దార్, సంబంధిత కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, సమగ్ర కుటుంబ సర్వే ఎనిమరేటర్లు, మిల్లర్స్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి కుటుంబ సమగ్ర సమాచారాన్ని సేకరించాలి

**జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యుల వివరాలు సమగ్ర సర్వేలో**
**నమోదు చేసిన మున్సిపల్ కమిషనర్, ఎన్యుమరేటర్లు**
**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్..**

**(మెదక్ ప్రతినిధి)నవంబర్,18, మెదక్ టుడే న్యూస్:**
సోమవారం, మెదక్ పట్టణం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమగ్ర కుటుంబ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకోవడం జరిగింది సమగ్ర కుటుంబ సర్వే సంబంధించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజల సహకారంతో సమగ్ర కుటుంబ సర్వే ప్రశాంతంగా కొనసాగుతుందని నిన్నటి వరకు 62.93% సమగ్ర కుటుంబ సర్వే నమోదయిందని 1,37, 673 కుటుంబాలకు.సమగ్ర సమాచారాన్ని సేకరించామని ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా ప్రతి కుటుంబం సమాచారాన్ని సేకరించిన సమాచార ఫార్మ్ లను గోప్యంగా ఉంచాలని సిబ్బందికిసూచించారు.ఈకార్యక్రమంలో మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ని మరేటర్లు పాల్గొన్నారు.



# గల్ఫ్ దేశాల్లో కఠినంగా చట్టాలు

## 100 మంది విదేశీయులకు మరణ శిక్ష విధింపు

**ఖతర్,నవంబర్18:** గల్ఫ్ దేశాల్లో చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. ముఖ్యంగా హత్య, డ్రగ్స్ సరఫరా, అత్యాచారం లాంటి నేరాలకు మరణ శిక్ష విధించబడుతుంది. దొంగతనం చేస్తే.. చేతి వేళ్లు, చేతులు, నరికివేయబడతాయి. ఈ శిక్షలు ముఖ్యంగా సౌదీ అరేబియా, ఖతర్ లాంటి దేశాల్లో తీవ్రంగా అమలు పరుస్తున్నారు. అక్కడి ప్రభుత్వాలు తమ దేశంలో నేరం జరగడాన్ని సహించవు. అయితే కొన్ని నేరాలకు మరణ శిక్ష విధించడంపై మానవ హక్కుల సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా సౌదీ అరేబియాలో ఈ సంవత్సరం మరణ శిక్ష ద్వారా వధించబడిన విదేశీయుల సంఖ్య 100 దాటేసింది. ఈ గణాంకాలు చాలా భయంకరగా ఉన్నాయని బెర్లిన్ లోని యూరోపియన్ – సౌదీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం నవంబర్ 16 2024న సౌదీ అరేబియా దేశంలోని దక్షిణ నజ్రాన్ ప్రాంతంలో ఒక యెమెన్ దేశస్తుడిని శిరచ్ఛేదన ద్వారా మరణ శిక్ష అమలు పరిచారు. ఆ వ్యక్తి తమ దేశంలో అక్రమంగా డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడ్డాడని.. అతడు దోషిగా తేలినందుకు మరణ శిక్ష విధించామని సౌదీ ప్రభుత్వం ప్రకటించింది. నజ్రాన్ మరణించిన యెమెనీ వ్యక్తితో కలిపి 2024లో మరణ శిక్ష ద్వారా చనిపోయిన విదేశీయుల సంఖ్య 101 కి చేరిందని స్థానిక మీడియా రిపోర్ట్. 2023, 2022 సంవత్సరాలలో మరణ శిక్ష ద్వారా వధింపబడిన నేరస్తుల కంటే 2024 లో వధింపబడిన విదేశీ నేరస్తుల సంఖ్య మూడింతలకు చేరింది. గత రెండు సంవత్సరాలలో 34 మంది విదేశీ నేరస్తులు వధించబడ్డారు అని ఫ్రెంచ్ మీడియా ఎఎఫ్‌పి తెలిపింది. విదేశీ నేరస్తులను ఇంత పెద్ద సంఖ్యలో శిరచ్ఛేదన లాంటి క్రూర శిక్షలు వేయడం చాలా సీరియస్ అంశం అని %జుూాఎ=% మానవ హక్కుల డైరెక్టర్ తాహా అల్ హజ్జీ అభిప్రాయపడ్డారు.అమ్నెస్టి ఇంటర్నేషన్నల్ రిపోర్ట్ ప్రకారం.. 2023లో విదేశీయులకు మరణ శిక్ష విధించిన దేశాల జాబితాలో చైనా, ఇరాన్ తరువాత మూడో స్థానంలో సౌదీ అరేబియా ఉండగా.. ఈ సంవత్సరం ఈ జాబితా సౌదీ అరేబియా ప్రథమ స్థానానికి చేరింది. ఇప్పటివరకు ఈ సంవత్సరంలో వధింపబడిన స్థానికులు, విదేశి నేరస్తుల సంఖ్య 274కు చేరింది. 2024 సంవత్సరం ముగిసేలోగా ఈ సంఖ్య 300 దాటుతుందని మిడిల్ ఈస్ట్ దేశాల్లో మరణ శిక్షలకు వ్యతరేకంగా పోరాడుతున్న జీద్ బస్‌యూనీ అనే మహిళా లాయర్ అభిప్రాయపడ్డారు. మరణ శిక్ష విధించబడిన విదేశీయుల కుటుంబ సభ్యులు అనుక్షణం భయం గుప్పిట్లో బతుకుతున్నారని ఆమె అన్నారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం.. మానవ హక్కులు పాటించడం లేదని సౌదీ అరేబియా ప్రభుత్వం చాలా కాలంగా విమర్శలు ఎదుర్కొంటూనే ఉంది. దీనివల్ల సౌదీలో విదేశీ పర్యాటకులు, పెట్టుబడిదారులుఅయితే ఈ సంవత్సరం మరణ శిక్ష ద్వారా చనిపోయిన విదేశీయుల జాబితాలో ఎక్కువ శాతం పాకిస్తానీలున్నారు. ఈ జాబితాలో అత్యధికంగా 21 మంది పాకిస్తానీలు, 20 మంది యెమెనీలు, 14 మంది సిరియా పౌరులు, 9 మంది ఈజిప్ట్ దేశస్తులు, 8 మంది జోర్డాన్, 7 మంది ఇథియోపియా దేశానికి చెందినవారున్నారు. ఆ తరువాత సుడాన్, ఇండియా, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, ఎరిత్రియా, ఫిలిప్పీన్స్ పౌరుల సంఖ్య చూస్తే.. ప్రతి దేశం నుంచి ముగ్గురు చనిపోయారు. వీరిలో వధించబడిన 101 మందిలో 69 మంది డ్రగ్స్ అక్రమ రవాణా చేసిన నేరస్తులు. విదేశి నేరస్తుల కేసుల్లో న్యాయ విచారణ పారదర్శకంగా జరగడం లేదని మానవ హక్కుల కార్యకర్తలు ఆరోపణలు చేస్తున్నారు.

# ఫార్మా కంపెనీపై ఎందుకంత ప్రేమ.. సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డ డీకే అరుణ



**హైదరాబాద్ :** కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో ఫార్మా కంపెనీకి స్థలం ఇవ్వని గ్రామస్తులపై దాడి ఘటనను బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రంగా ఖండించారు. ఫార్మా కంపెనీలపై ముఖ్యమంత్రికి ఎందుకంత ప్రేమ అని ప్రశ్నించారు. సంగారెడ్డి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న 16 మంది లగచర్ల బాధితులతో బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్ ములాఖత్ అయ్యారు. అనంతరం డీకే అరుణ మాట్లాడుతూ.. ఓటేసి గెలిపించిన జనాల కంటే మీకు ఫార్మా కంపెనీ ముఖ్యమా అని నిలదీశారు. లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమని రైతులు 8 నెలలుగా ఆందోళన చేస్తున్నారని ఎంపీ డీకే అరుణ అన్నారు. బలవంతంగా భూములు లాక్కుంటామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారని పేర్కొన్నారు. రైతులు ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించారని చెప్పారు. వాస్తవంగా ప్రజాభిప్రాయ సేకరణకు రాకపోతే కలెక్టర్ ఒక్కరే ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. పోలీసుల వైఫల్యంతోనే లగచర్ల ఘటన జరిగిందని డీకే అరుణ అన్నారు. సీఎం రేవంత్ సోదరుడు అక్కడ ఉన్న రైతులను భయపెట్టారని తెలిపారు. భూములు ఎలాగైనా గుంజుకుంటామని చెప్పారన్నారు. ఘటన తర్వాత రాత్రి గ్రామాల్లోకి వచ్చి పోలీసులు ఇష్టం వచ్చినట్టు దాడి చేశారని పేర్కొన్నారు. గొడవ జరిగిన ఘటనలో కాంగ్రెస్ పార్టీ వాళ్లను వదిలేసి మిగతా వాళ్లను అరెస్ట్ చేశారని అన్నారు. భూములు ఇవ్వమని చెబితే సీఎం రేవంత్ స్వయంగా వెళ్లి వాళ్లను కలిసి మాట్లాడితే బాగుండేదని అన్నారు. కానీ ఇవన్నీ చేయకుండా భయపెట్టి దాడులు చేపించి ఇలా చేయడం కరెక్టు కాదని స్పష్టం చేశారు.

సీఎం సోదరుడు అక్కడికి వెళ్ళవచ్చు కానీ నన్ను అక్కడికి వెళ్లకుండా ఎందుకు అడ్డుకున్నారని డీకే అరుణ ప్రశ్నించారు. రైతులతో దౌర్జన్యంగా బెదిరించి సంతకాలు పెట్టించుకుంటున్నారని తెలిపారు. మీరు సీఎం అయితే మా నియోజకవర్గం బాగుంటుందని అనుకుంటే మీరు జనాలపై కక్ష కట్టారన్నారు. సీఎంకు ఫార్మా కంపెనీలపై అంత ప్రేమ ఎందుకని నిలదీశారు. ఓటేసి గెలిపించిన జనాల కాంటే మీకు ఫార్మా కంపెనీ ముఖ్యమా అని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. సీఎం కొడంగల్ వాసులు కాదు వలస వచ్చారని డీకే అరుణ తెలిపారు. మీకు నచ్చిన వారికి కంపెనీలు అప్పజెప్పడానికే ఫార్మా కంపెనీలు పెడుతున్నారని మండిపడ్డారు. వెంటనే లగచర్ల బాధితులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంథాలు వద్దని.. నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష ముఖ్యమని అన్నారు. గర్భిణీ స్త్రీ అని చూడకుండా ఇలా చేయడం దారుణమని అన్నారు. సీఎం రేవంత్ అహంకారం వీడాలని.. ఒప్పించి భూములు తీసుకోవాలని సూచించారు.

# కూలీ డబ్బుల విషయంలో గొడవ..

## కర్రతో మేస్త్రిని కొట్టి చంపిన కూలి!



**హైదరాబాద్ :** మెదక్‌లో దారుణ హత్య జరిగింది. కూలీ డబ్బుల విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవలో కూలి కోపంతో కర్రతో మేస్త్రి తలపై బలంగా కొట్టాడు. తలకు బలమైన గాయం కావడంతో మేస్త్రి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మెదక్ జిల్లా కాళ్లకల్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన ప్రమోద్ పాశ్వాన్ (42) తాపీమేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన నరేష్ కాళ్లకల్‌లో నూతన ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. ఆ ఇంటి నిర్మాణ పనులను గత ఆరు నెలలుగా ప్రమోద్ పాశ్వాన్ కూలీలతో కలిసి చేస్తున్నాడు. పాశ్వాన్ కింద హరియాణాకు చెందిన బిట్టు, అతని భార్య కూలీలుగా పనిచేస్తున్నారు. కొద్ది రోజులుగా బిట్టు నిర్మాణంలో ఉన్న ఇంట్లోనే భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో మేస్త్రి పాశ్వాన్, బిట్టు ఆదివారం రాత్రి మద్యం తాగడానికి వెళ్లారు. అక్కడ మద్యం తాగాక కూలీ డబ్బుల విషయంలో మేస్త్రికి బిట్టుకి మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన బిట్టు కర్రతో మేస్త్రి పాశ్వాన్ తలపై బలంగా కొట్టాడు. అతని తలకు బలమైన గాయం కావడంతో మేస్త్రి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తూప్రాన్ సీఐ రంగకృష్ణ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఇంటి యజమాని నరేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో..ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెందిన ఓ రైతు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాయపోల్‌కు చెందిన ఉప్పుగళ్ల రాములు (50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య పోశవ్వ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రాములు పెట్టుబడుల కోసం అప్పులు తెచ్చి పంట వేశాడు. ఆ పంట సరిగ్గా పండకపోవడంతో అప్పులు అలాగే ఉన్నాయి. కొడుకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆసుపత్రి ఖర్చుల కోసం మళ్లీ అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనపడక తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. ఆదివారం ఉదయం రాములు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

# వేములవాడ రాజన్న భక్తులకు శుభవార్త.. రూ.127.65 కోట్లు మంజూరు



**హైదరాబాద్ :** వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం అభివృద్ధి పనులకు.. రూ.127.65 కోట్లు మంజూరు చేస్తూ.. తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శ్రీ రాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తులకు అవసరమైన అధునాతన సదుపాయాల కల్పనకు రూ.76 కోట్లు, ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్ల విస్తరణ కోసం రూ.47.85 కోట్లు, మూలవాగులోని బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల కమాన్ జంక్షన్ వరకు డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి రూ.3.8 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం పర్యటన.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 20న రాజన్న సిరిసిల్ల జిలా ్లలో పర్యటించనున్నారు. సీఎం పర్యటనకు ముందే ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సీఎం షెడ్యూల్ ఖరారు కావడ ంతో అధికారులు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఏర్పాట్లలో నిమ గ్నమయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల, వేములవాడలో పర్యటించి ఏర్పాట్లపై సమీక్షించారు. రాజన్న ఆలయంలో చేయాల్సిన ఏర్పాట్లను జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు పరిశీలించారు. సీఎం సందర్శించే ఛైర్మన్ గెస్ట్ హౌజ్, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసే ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. సమావేశం జరిగే హాల్‌లో విద్యుత్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేవంత్ రెడ్డి పర్యటించే ఎన్టీఆర్ అతిథి గృహంలో మార్పులు చేయాల్సిన అంశాలపై సూచనలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మొదట సిరిసిల్లలోని కలెక్టరేట్ సమీపంలోని ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి, కొన్నేళ్లుగా బ్రిడ్జి నుండి దేవాలయం వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి నిర్మాణాలకు శ్రీకారం చుడతారు. వేములవాడ దేవ స్థానం అభివృద్ధి కోసం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించింది. ఇటీవలే ఆలయ విస్తరణ కోసం శృంగేరి పీఠా ధిపతి అనుమతుల కోసం ఆలయ అధికారులు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెళ్లి వచ్చారు. ఆలయంలో నిత్య నివేదనశాల, అభిషేక మంటపానికి శంకుస్థాపన చేయనున్నారు. బ్రిడ్జి నుండి దేవాలయం వరకు 80 ఫీట్ల రోడ్ల వెడల్పు కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు.

# హైదరాబాద్ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్‌లో అప్రెంటీస్, 300 ఖాళీలు, దరఖాస్తు చేయండి ఇలా..




**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ ఐటీఐ అభ్యర్థులకు అప్రెంటీస్ అందించేందుకు నోటిఫికేషన్ వెలువడింది. మొత్తం 300ఖాళీలను ఈ నోటిఫికేషన్ ద్వారా శిక్షణ కల్పిస్తారు. శిక్షణా కాలంలో రూ.8050 భృతిని అందిస్తారు. పదవ తరగతి తర్వాత ఐటీఐలో పాస్ అయిన అభ్యర్థులు అప్రెంటీస్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 300ఖాళీలు...అప్రెంటీస్‌లో భాగంగా ఐటీఐ ఫిట్టర్ ఖాళీలు 95, టర్నర్ 22, ఎలక్ట్రిషియన్ 30, మెషినిస్ట్ 17, కెమికల్ ప్లాంట్ ఆపరేటర్ 7, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్స్ 11,ఎలక్ట్రానిక్స్ మెకానిక్స్ 18, లేబొరేటరీ అసిస్టెంట్ 10, మోటర్ మెకానిక్స్ 3 అప్రెంటీస్ డ్రాఫ్ట్మెన్ మెకానికల్ 2 ఖాళీలు ఉన్నాయి. కంప్యూటర్ ప్రోగ్రామర్ అండ్ అసిస్టెంట్, 47, డీజిల్ మెకానిక్ 4, కార్పెంటర్ 4, ప్లంబర్ 4, వెల్డర్ 24, స్టెనోగ్రాఫర్ 2 పోస్టులు భర్తీ చేస్తారు. చివరి ఆరు క్యాటగిరీలకుప్రతి నెల రూ.7700 వేతనం చెల్లిస్తారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలను బట్టి పోస్టుల సంఖ్యను పెంచడం లేదా తగ్గించడం చేస్తారు. అభ్యర్థులు హైదరాబాద్‌లోని న్యూ క్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ కోడ్ 11153600013కు దరఖాస్తు చేయాల్సి ఉటుంది. దరఖాస్తు గడువు..దరఖాస్తు చేయడానికి చివరి తేదీ నవంబర్ 25గా పేర్కొన్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత అప్రెంటీస్ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎలక్ట్రిషియన్ మినహా మిగిలిన పోస్టులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. పదో తరగతి, ఐటీఐలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఎలక్ట్రిషియన్ ట్రేడ్‌లో ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. షార్ట్ లిస్ట్ అయిన అభ్యర్థులకు మెయిల్ ద్వారా సమాచారం అందిస్తారు.

# ర్యాగింగ్ పేరిట మూడు గంటలు నిల్చోబెట్టిన సీనియర్లు.. వైద్య విద్యార్థి మృతి



**హైదరాబాద్ :** గుజరాత్ రాష్ట్రంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. సీనియర్ల ర్యాగింగ్ ఓ వైద్య విద్యారి బలయ్యాడు. పటాన్‌లోని ధర్పూ ర్‌లో గల జీఎమ్ఈఆర్ఎస్ మెడికల్ వైద్య కళాశాలలో ఈ ఘటన చోటు చేసు కుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్ మథానియా అనే విద్యార్థి జీఎమ్ఈఆర్ఎస్ మెడికల్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే, శనివారం రాత్రి ఫస్ట్ ఇయర్ విద్యార్థులతో సీరియర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. ర్యాగింగ్‌లో భాగంగా అనిల్‌ను సీనియర్లు దాదాపు మూడు గంటల పాటు నిలబెట్టారు. దీంతో అనిల్ ఒక్కసారిగా అపస్మారకస్థితిలోకి చేరుకుని కుప్పకూలిపోయాడు. తోటి విద్యార్థులు వెంటనే అతిన్ని ఆసుపత్రికి తరలించినా ఫలితం లేదు. చికిత్స పొందుతూ అనిల్ ప్రాణాలు కోల్పోయాడు. ఘటన అనంతరం సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్ వల్లే అనిల్ మరణించాడంటూ అతడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్ విద్యార్థులపై మేనేజ్‌మెంట్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. సదరు విద్యార్థులను హాస్టల్, కళాశాల నుంచి సస్పెండ్ చేసినట్లు మెడికల్ వైద్య కళాశాల అధికారులు తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై ఈ చర్యలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి చేపట్టారు.

# అంబులెన్స్‌కు దారివ్వని వ్యక్తి.. రూ.2.5 లక్షల జరిమానా

**హైదరాబాద్ :** రోడ్డుపై సైరన్ మోగిస్తూ అంబులెన్స్ వెళ్తుందంటే ఎవరో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని అర్థం. అందుకే అంబులెన్స్ సౌండ్ వినిపించగానే ఎంతటివారైనా సరే వెంటనే తమ వాహనాలను సైడ్‌కు తీసుకుంటారు. సినీ సెలబ్రిటీలైనా, రాజకీయ నేతలైనా.. చివరికి ప్రధాని, రాష్ట్రపతి అయినా సరే అంబులెన్స్ వెళ్లేందుకు దారి ఇస్తారు. అయితే, కొందరు ఆకతాయిలు ఇవేవీ పట్టించుకోరు. అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోగా.. అడ్డుగా వెళ్తుంటారు. తాజాగా ఓ వ్యక్తి అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా నిర్లక్ష్యంగా కారు నడిపినందుకు పోలీసులు షాక్ ఇచ్చారు. కారు నడిపిన వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా.. భారీ జరిమానా కూడా విధించారు.



ఈ ఘటన కేరళ త్రిస్సూర్ నవంబర్ 7న చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని చలకుడిలోని పొన్నాని నుంచి త్రిస్సూర్ మెడికల్ కాలేజీకి అంబులెన్స్‌లో తీసుకెళ్తున్నారు. రోడ్డుపై అంబులెన్స్ వెళుంటే అన్ని వాహనాలూ సైడ్‌కు వెళ్లాయి. అయితే, ఓ కారు మాత్రం అంబులెన్స్ ఎంతగా హారన్ కొడుతున్నా, కుయ్ కుయ్ అంటూ సౌండ్ చేస్తున్నా అవేవీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దాదాపు రెండు కిలోమీటర్ల వరకూ అంబులెన్స్ ఆ కారు వెనకాలే వెళ్లాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో కేరళ పోలీసుల దృష్టికి వెళ్లడంతో వారు చర్యలకు ఉపక్రమించారు. వీడియో ఆధారంగా ఆ కారు ఎవరిదో గుర్తించారు. నేరుగా ఆ వ్యక్తి ఇంటికి వెళ్లి.. అంబులెన్స్‌కు దారి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీంతో అతడు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పోలీసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సదరు వ్యక్తికి షాక్ ఇచ్చారు. దాదాపు రూ.2.5 లక్షల భారీ జరిమానా విధించారు. అంతేకాదు అతడి లైసెన్స్ కూడా రద్దు చేశారు.

# 2025లో పది వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రారంభించనున్న రైల్వేశాఖ.. ట్రైన్ రూట్, ఫీచర్స్ డిటెయిల్స్ ఇవే..!

**హైదరాబాద్ :** భారతీయ రైల్వేశాఖ ఎప్పటికప్పుడు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నది. ఇందులో భాగంగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య దూసుకెళ్లనున్నాయి. ఈ రైళ్లకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ క్రమంలోనే కొత్తగా వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టబోతున్నది. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం.. 2025–26 మధ్య నాటికి భారత్‌లో వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. ప్రపంచస్థాయి సౌకర్యాలు, అత్యాధునిక డిజైన్‌తో తీర్చిదిద్దిన ఈ రైళ్లు సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల కోసం రైల్వేశాఖ అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఓ నివేదిక ప్రకారం.. భారతీయ రైల్వే.. 2025–26 నాటికి పది వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నది. భారతదేశపు తొలి వందే భారత్ స్లీపర్ రైలు ట్రయల్ రన్ తర్వాత 2025లో ప్రారంభించే అవకాశం ఉన్నది. చెన్నైకి చెందిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ సుబ్బారావు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. నవంబర్ 15 నుంచి రెండునెలల పాటు రైళ్ల ఆసిలేషన్ ట్రయల్స్‌తో పాటు ఇతర పరీక్షలు నిర్వహిస్తామని.. ఆ తర్వాత కమర్షియల్ సర్వీస్‌లోకి తీసుకువస్తామని తెలిపారు.



వందే భారత్ స్లీపర్ రైళ్లు ప్రయాణీకుల భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యతనిచ్చేలా రైల్వేశాఖ తీర్చిదిద్దింది. ఈ రైళ్లు ఆస్తెనిటిక్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారయ్యాయి. క్రాష్ బఫర్, ప్రత్యేకంగా రూపొందించిన కప్లర్‌ల వంటి అధునాతన భద్రతా పరికరాలతో అమర్చబడి ఉండనున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులను సురక్షితంగా ఉండేలా సామర్థ్యం ఉంటుంది. ఈ స్లీపర్ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉంటాయి. 823 మంది ప్రయాణికులు ఈ రైలు ప్రయాణించేందుకు వీలుంటుంది. ఫస్ట్ క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ, థర్డ్ క్లాస్ ఏసీ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. వందే భారత్ స్లీపర్ రైలు నడిచే మార్గాలను ఇంకా ఖరారు చేయలేదు. అయితే, న్యూఢిల్లీ పూణే, న్యూఢిల్లీ శ్రీనగర్ తదితర మార్గాల్లో నడిపేందుకు రైల్వేశాఖ ప్రయత్నాలు చేస్తున్నది.

# జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేసిన లగచర్ల బాధితులు



**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల ఫార్మా కంపెనీ బాధిత రైతు కుటుంబాల పోరాటం కొనసాగుతోంది. నిన్న ఢిల్లీకి చేరుకున్న బాధితులు.. సోమవారం ఉదయం జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను కలిశారు. లగచర్లలో అర్ధరాత్రి సమయంలో తమపై పోలీసులు జరిపిన దాడి గురించి జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు బాధితులు వివరించారు. పార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తే తమ వారిని అక్రమంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, లగచర్ల బాధితులకు బీఆర్ఎస్ అండగా నిలబడింది. జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను కలిసేందుకు లగచర్ల బాధితుల వెంట ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, ఎంపీ వద్దిరాజు, మాజీ ఎంపీ మాలోతు కవిత, జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వెళ్లారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI, MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail medaktoday89@gmail.com-cll, 9948265095-9494117870..Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, medaktoday89@gmail.com 9948265095..